ఆర్జీయూకేటీలో వ్యవస్థాపక అవగాహన కార్యక్రమం

బాసర, డిసెంబర్ 21 : బాసర ఆర్జీయూకేటీలో శనివారం వ్యవస్థాపక అవగాహన కార్యక్రమాన్ని ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ చార్జి వీసీ గోవర్ధన్, ఐఐఎఫ్టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీ దర్శన్ మాట్లాడుతూ విద్యార్థులలో వ్యవస్థాపక సంస్కృతిని పెంపొందిచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగార్థులు కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మారడానికి వీలు కల్పిస్తుందని వెల్లడించారు. నేటి వేగవంతమైన ఆర్థిక వ్యవస్థలో వ్యవస్థాపకత ప్రాముఖ్యతను విద్యార్థులు తమ కేరీర్‌లో విజయం సాధించేందుకు వినూత్నంగా ఆలోచించాలని, వ్యవస్థాపక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, డాక్టర్ చంద్రశేఖర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 21: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థులకు సోమవారం నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు పేటీఎం కంపెనీలో 100 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పదో తరగతి, ఆపై విద్యార్హత గల వారు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వంద శాతం ఇంటి పన్నులు చెల్లించేలా చూడాలి

దిలావర్‌పూర్, డిసెంబర్ 21: గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు చెల్లించే విధంగా ప్రజలను చైతన్య పరచాలని ఎంపీవో గోవర్ధన్ సూచించారు. శనివారం మండలంలోని కంజర్, సిర్గాపూర్, కాల్వ గ్రామాలను ఆయన సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులు వంద శాతం చెల్లించే విధంగా పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతూ పన్నులు తీసుకరావాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు కిరణ్, శ్రావణ్ ఉన్నారు.

బూత్ అధ్యక్షుల ఎన్నిక

లోకేశ్వరం, డిసెంబర్ 21: లోకేశ్వరం మండలంలోని రాజురా గ్రామంలోని 188, 189, 190 పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. 188 బూత్ అధ్యక్షుడిగా ఉన్నగుండోల్ల నవీన్, కార్యదర్శిగా గోనె హరీశ్, 189 బూత్ అధ్యక్షుడిగా జడల రమేశ్, కార్యదర్శిగా తోకల నవీన్, 190 బూత్ అధ్యక్షుడిగా అయిటి సాయన్న, కార్యదర్శిగా కమ్మరాశి దేవన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

28న జాబ్‌మేళా

ఉట్నూర్, డిసెంబర్ 20: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 28వ తేదీన ఉట్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్స్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రిటైల్, సెక్యూరిటీ, మార్కెటింగ్, ఫార్మ, హెల్త్ సెక్టర్ కంపనీలకు సంబంధించిన పలు కంపనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. కావున గిరిజన యువత తమ సర్టిఫికెట్లతో ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

ఎదులాపురం, డిసెంబర్ 21 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. అప్‌గ్రేడ్ సహకారంతో హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో శాశ్వత ప్రాతిపదికన రూ.20వేలపైన జీతభత్యాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.ఏదైన డిగ్రీ, బీటెక్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉండి 1994-2004మధ్య జన్మించి 30 సంవత్సరాలు లోపు వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8106764653 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి పత్తి ధర కుదింపు

కుభీర్, డిసెంబర్ 21: సోమవారం నుంచి సీసీఐ క్వింటాల్ పత్తికి రూ.50 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు కుభీర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. పత్తిలో గింజ పొడవు, స్టెబుల్ తగ్గనున్న నేపథ్యంలో ధరలను కుదించినట్లు ఆయన పేర్కొన్నారు. 23వ తేదీ నుంచి క్వింటాల్ పత్తికి రూ.7471 లభించ నుందని మండల పత్తి రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

బోథ్, డిసెంబర్ 21: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేపడుతున్నారు. శనివారం బోథ్ చేపడుతున్న సర్వేను ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. 33 జీపీల పరిధిలో 13006 ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. 33 జీపీల్లో 48 మంది సర్వేయర్లు దరఖాస్తులు చేసుకున్న వారి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో సర్వేయర్ 25 నుంచి 30 చొప్పున దరఖాస్తు దారుల వివరాలు క్షేత్రస్థాయి సేకరిస్తున్నారని ఎంపీడీవో తెలిపారు.

నార్నూర్, డిసెంబర్ 21 : మండలంలోని బేతల్‌గూడ, సోనాపూర్, మరపగూడ, బలాన్‌పూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో జవహర్‌లాల్ శనివారం పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ ఈసీ రాథోడ్ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు రవి, అవినాశ్, శ్రీనివాస్ ఉన్నారు.

దస్తురాబాద్, డిసెంబర్ 21 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలోని భూత్కుర్, రాంపూర్, మున్యాల, మున్యాల తండా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రమేశ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు దేవేందర్, రంజిత్ ఉన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఫ్రూట్స్ తప్పనిసరి

కుభీర్: పండ్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కుభీర్, డిసెంబర్ 21: కుభీర్‌లోని చాణక్య పాఠశాలలో శనివారం ఫ్రూట్స్ డే ను ఘనంగా జరుపుకున్నారు. వివిధ రకాల పండ్లను తెప్పించి ప్రీ ప్రైమరీ విద్యార్థులకు తినిపించి వాటి వల్ల కలిగే లాభాలను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణితశాస్త్రంపై ప్రత్యేక నాటికలు ప్రదర్శించారు. హెచ్ఎం నరేశ్, సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

తాంసి, డిసెంబర్ 21: సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో అండర్ -14, 17 విభాగంలో 9వ తరగతి విద్యార్థులు శివ కార్తీక్, అరవింద్ తమ ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఎంఈవో శ్రీకాంత్, పీడీ శ్రీనివాస్ తెలిపారు.

ఇంద్రవెల్లి: తాళం వేసివున్న హీరాపూర్ టీడబ్ల్యూపీఎస్ పాఠశాల

మూసి ఉన్న రాంలింగంపేట్ టీడబ్ల్యూపీఎస్ పాఠశాల

మూసి ఉన్న మల్కుగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాల

మూతపడిన టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 21: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలు ఈ నెల 16వ తేదీ నుంచి ఐటీడీఏ ఎదుట తమ డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేపడుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు లేకపోవడంతో మండలంలోని హీరాపూర్, మల్కుగూడ, రాంలింగంపేట్, టేకిడిగూడ, దోడంద లంబాడీతండా, ధర్మూగూడ, గోపాల్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లో టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలకు తాళం వేయడంతో మూసి ఉన్నట్లు కనిపిస్తున్నాయి. వారం రోజుల నుంచి సీఆర్‌టీలు విధులకు హాజరు కాక పోవడంతో తమ పిల్లలు చదువులకు దూరమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు చదువులు నేర్పించాలని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.

దిలావర్‌పూర్‌లో వాక్సినేషన్ సెంటర్ ఖాళీగా ఉన్న ప్రదేశం

సమయానికి వాక్సినేషన్ నొచుకోని చిన్నారులు

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 21: దిలావర్‌పూర్ గ్రామంలో శనివారం నిర్వహించవలసిన వాక్సినేషన్ నిర్వహించలేదు. ఈ ఏరియాలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం-2 నిర్మల్‌లో జరిగిన ఏఎన్ఎం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. రెగ్యూలర్‌గా ఉన్న ఏఎన్ఎం -1 విధులకు హాజరుకాలేదు. దీంతో చిన్నారులు సమయానికి వాక్సినేషన్‌కు నోచుకోలేదు. ఈ విషయమై సంబంధిత వైద్యా పర్యవేక్షణాధికారి ప్రేమలతను వివరణ కోరగా దిలావర్‌పూర్‌లో శనివారం వేయవలసిన వాక్సిన్ నేషన్ కార్యక్రమం జరుగలేదన్నారు. రెగ్యూలర్‌గా ఉన్న ఏఎన్ఎం -1కు కాల్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ ఉందన్నారు. శనివారం ఇవ్వలిసిన వాక్సినేషన్లు తిరిగి సోమవారం వేస్తామని తెలిపారు.

నిరసన ర్యాలీని విజయవంతం చేయండి

మాట్లాడుతున్న అంబేద్కర్ ఆత్మ గౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకుడు గణేశ్

ఎదులాపురం, డిసెంబర్ 21 : భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం ఆదిలాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ఉదయం 11 గంటలకు నిర్వహించే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని అంబేద్కర్ ఆత్మ గౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకుడు గణేశ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీల జెండాలను పక్కనపెట్టి కులమతాలకు అతీతంగా అంబేద్కర్ వాదులు మానవతావాదులు విద్యావంతులు ఉద్యోగులు ఇందులో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జహీర్ రంజానీ, సాహిదుద్దీన్, సందీప్, నిమ్మల ప్రశాంత్, దయాకర్, నవీన్ ,సాజీదుద్దీన్, న్యాయవాది మహ్మద్ గౌస్, అర్పత్ ఖాన్, నజీర్, షైక్ ఖలీల్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలి

ఉపాధి హామీ ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్డీవో సాయన్న

బజార్‌హత్నూర్, డిసెంబర్ 21: ప్రతి కుటుంబానికి వంద రోజుల ఉపాధి హామీ పని కల్పించాలని డీఆర్డీవో సాయన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం ఎన్ఆర్ఈజీఎస్ పనులపై చేపట్టిన తనిఖీ వివరాలను వెల్లడించారు. ఆయా గ్రామ పంచాయతీల డీఆర్పీలు గ్రామల్లో నెలకొన్న సమస్యలు డీఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం డీఆర్డీవో సాయన్న మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూలీలకు 100 రోజుల పనులు కల్పించాలని, కూలీల పనికి తగ్గ వేతనం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ కుటుంబరావు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రాజేశ్వర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కడెం: అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కడెం, డిసెంబర్ 21: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కడెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. అమిత్‌షా అంబేద్కర్‌తో పాటు యావత్ దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేశ్, నేతకాని/మహర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు పసుల రాజలింగం, రమేశ్, గంధం రవి, జోసెఫ్, గంగారాం, జాడి గంగాధర్, దుర్గం గంగాధర్, బోర్లకుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

ఉట్నూర్, డిసెంబర్ 21: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని బంజారా రాష్ట్ర నాయకుడు భరత్ చౌహాన్ డిమాండ్ చేశారు. అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం ఉట్నూర్‌లోని ఐబీలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు ఆయన హాజరై మాట్లాడారు. మహనీయులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మతిస్థిమితం లేకుండా మాట్లాడిన అమిత్‌షా కేంద్రమంత్రికి పదవికి వెంటనే రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు ప్రజ్ఞశీల్, దాసండ్ల ప్రభాకర్, రాజమణి, సింగారే భరత్, వెంకటేశ్, కాటం రమేశ్ పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

భైంసా, డిసెంబర్ 21: అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్ డిమాండ్ చేశారు. భైంసాలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫారూఖ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం, డిసెంబర్ 21 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ చౌక్‌లో దళిత సంఘాలు, ఆయా పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, దళిత సంఘాల నాయకులు భారత్ వాఘ్మారే, రత్నజాడే ప్రజ్ఞకుమార్, జమీల్, శోభతాయి తుల్జాపూరే, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఉట్నూర్: మాట్లాడుతున్న నాయకుడు భరత్ చౌహాన్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

భైంసా, డిసెంబర్ 21 : సీఎం కప్ జిల్లా స్థాయి ఉషు పోటీల్లో ఖేల్ ఇండియా సెంటర్ భైంసా నుంచి పది మంది విద్యార్థులు సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ శ్రీరాముల సాయికృష్ణ జ్ఞానతేజ అన్నారు. శనివారం భైంసాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 26న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఇప్పటికే వీరికి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రశంసా పత్రాలు అందజేశారన్నారు. ఎంపికైన వారిలో నక్షత్ర, రాజేశ్వరి, మమత, పల్లవి, కళ్యాణ్ బాయి, రహమాన్, తిరుపతి, కృష్ణ, నిలేశ్, యువరాజ్, తదితరులు ఉన్నారు.

మండల ఇందిరమ్మ కమిటీలు ఎంపిక..

తాంసి, డిసెంబర్ 21 : మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీలను కలెక్టర్ రాజర్షి షా ఎంపిక చేసినట్లు మాజీ ఎంపీపీ సురకుంటి మంజుల శ్రీధర్ రెడ్డి తెలిపారు. గ్రామ కమిటీల్లో ప్రత్యేక అధికారి కమిటీ చైర్మన్‌గా ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలు, మరో ముగ్గురు (బీసీ, ఎస్సీ, ఎస్టీ) అలాగే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను సభ్యులుగా నియమించినట్లు పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని వెల్లడించారు.

23న కబడ్డీ జూనియర్ బాలుర జిల్లా జట్టు ఎంపిక పోటీలు

భైంసాటౌన్, డిసెంబర్ 21 : నిర్మల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన ఉదయం 9 గంటలకు ఖత్గాం సమీపంలోని వేదం తపోవన్ పాఠశాల మైదానంలో కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు..ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మెమో, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కడెం, డిసెంబర్ 21 : విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఖానాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ జితిన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ సైదారావు, ఎస్ఐ కృష్ణాసాగర్ రెడ్డి, న్యాయవాదులు వెంకట మహేంద్ర, శివ, ఎఫ్ఆర్వోలు అనిత, గీతారాణి, హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌వోలు సిద్ధార్థ, ప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదెలు మృతి

లక్ష్మణచాంద, డిసెంబర్ 21 : విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి చెందిన ఘటన లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుమలత వివరాల ప్రకారం... పీచర గ్రామంలోని రైతు రాజారపు ఆశన్నకు చెందిన రెండు గేదెలు శనివారం మేతమేయడానికి వెళ్లి గ్రామ శివారులోని గోదావరిలో నీరు తాగడానికి వెళ్లాయి. అదే గ్రామానికి చెందిన బుర్రి దేవన్న, బుర్రి అశోక్ అనే రైతులు కరెంట్ స్తంభం నుంచి విద్యుత్ మోటర్‌కు అమర్చిన సర్వీస్‌వైరుతో విద్యుత్ షాక్ తగలడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధిత రైతు రాజారపు ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమలత తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

సారంగాపూర్, డిసెంబర్ 21 : నిర్మల్‌లోని ఐకే రెడ్డి కాలనీకి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన జాదవ్ సురేశ్(45) నిర్మల్‌లోని ఐకే రెడ్డి కాలనీలో రెండు సంవత్సరాలుగా నివాసముంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. గురువారం సారంగాపూర్ బ్యాంకుకు వెళ్లి వస్తానని భార్య వచ్చలకు తెలిపాడు. ఇంటి నుంచి వెళ్లిన సురేశ్ తిరిగి రాలేదు. అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వచ్చే సంవత్సరం నుంచి ప్రతిభా పరీక్షలు నిర్వహించం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 21 : వచ్చే సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించబోమని ప్రతిభా పరీక్షల ఫోరం బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితేసేందుకు అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులం కలిసి తామే ఆర్థిక పరమైన వనరులు సమకూర్చుకుని ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించామన్నారు. ఈ ఫోరంకు మతాలకు, సంఘాలకు సంబంధం లేదన్నారు. కాగా కొందరు వ్యక్తులు జోక్యం చేసుకుని భాష, మతపరమైన భేదాలు సృష్టిస్తూ ఈ కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నారన్నారని అందువల్ల ఈ ప్రతిభ పరీక్షలు నిర్వహించబోమని ఫోరం బాధ్యులు చట్ల శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, నారాయణవర్మ, సత్యనారాయణ, అశోక్‌కుమార్ పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సారంగాపూర్, డిసెంబర్ 21 : సారంగాపూర్ మండలంలోని కొట్ల(బీ) ఫంక్షన్‌హాల్‌లో ఫేమ్ విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 200 మందికి జీర్ణవ్యవస్థకు సంబంధించిన 16 రకాల పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

విద్యార్థులను బాగా చదివించేలా చూడాలి

సోన్, డిసెంబర్ 21: పాఠశాలలో చదువుకున్న పాఠాలను ఇంటి వద్ద ప్రతి రోజూ పిల్లలు చదువుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. శనివారం కడ్తాల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆహార దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి వద్దనే వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి తీసుకొని వచ్చి పాఠశాలలో ప్రదర్శించారు. ఆరుబయట ఉన్న ఆహారాన్ని దూరంగా ఉండాలని, అమ్మ చేతి వంట తింటేనే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తొడిశెట్టి పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

సోన్, డిసెంబర్ 21: నిర్మల్ మండలం భాగ్యనగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తొడిశెట్టి గంగారాం మాతృమూర్తి రాజవ్వ ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎంపీపీ వీ సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. ఆయన వెంట బషీర్ అలీ, నంద ముత్యం, మాజీ సర్పంచ్ అశోక్ ఉన్నారు.

అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

బోథ్: వేదం పాఠశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

బోథ్/భైంసా/దస్తురాబాద్, డిసెంబర్ 21: బోథ్‌లోని మోడల్ స్కూల్, వేదం పాఠశాల, భైంసాలోని గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, దస్తురాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో బోథ్ మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, వేదం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీ సంతోష్, గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భీంరావ్, దస్తురాబాద్ మండల విద్యాధికారి టీ గంగాధర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 21 : సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మహా సభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర 4వ మహాసభలు జనవరి 25 నుంచి 28వ తేదీల్లో సంగారెడ్డిలో జరుగనున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, భీంరావ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్ మంజుల, ఆర్ సురేందర్, నాయకులు ఆశన్న, ప్రభు, ధోని పెల్లి స్వామి, మోహన్, అశోక్ పాల్గొన్నారు.

ఎదులాపురం: రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపకులు